క్లుప్తంగా

బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ అమ్మవారు

కార్వేటినగరం: కార్వేటినగరం గ్రామదేవతగా విరాజిల్లుతున్న శ్రీబంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, నారికేళ జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారి మూల విరాట్‌ను పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మహిళా భక్తులు అమ్మవారికి పొంగళ్లు వండి పిండి దీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్లై, భక్తులు పలువురు పాల్గొన్నారు.

తాజా కూరగాయలను వాడండి




విద్యార్థుల కోసం తయారు చేస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చేస్తున్న మధ్యాహ్న భోజనం తయారీలో తాజా కూరగాయలు వాడాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం తిరుమలరాజుపురం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చేస్తున్న మధ్యాహ్న భోజనానికి వచ్చే బియ్యాన్ని మంచి నీటితో రెండు, మూడుసార్లు కడిగిన తరువాతే అన్నం వండాలన్నారు. ముఖ్యంగా తాజా కూరగాయలు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు సరిపడా భోజనం పెట్టాలని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు చేసిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

సాయిబాబా ఆలయంలో పాలాభిషేకం రేపు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం పాలాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు ఆర్.బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఏటా నిర్వహించే పాలాభిషేకం కార్యక్రమానికి బాబా భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. భక్తులు తమ స్వహస్తాలతో బాబాకు పాలాభిషేకం చేయాలని కోరారు. గురువారం ఆలయంలో మొక్కులు ఉన్న భక్తులు అన్న ప్రసాదాలు పంచి పెడతారని, అదేవిధంగా మధ్యాహ్నం వెయ్యిమందికి అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు ప్రతిఒక్కరూ తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని పిలుపునిచ్చారు.

లాలీపాప్ తినడం నాకొచ్చుగా..



లాలీపాప్‌ను చప్పరిస్తున్న వానరం

నగరి : స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో ఒక వానరం లాలీపాప్ చేతిలో పట్టుకుని చెట్టుపై చేసిన విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. లాలీపాప్‌ను చిన్న పిల్లల మాదిరి చప్పరించుకుంటూ తినడం చూసి అక్కడున్న వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వాటిని ఎలా తినాలో కోతులకు కూడా తెలుసా అంటూ చమత్కరించుకున్నారు.

విద్యాసంస్థల బంద్ రేపు

పుత్తూరు: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ యూనియన్లు సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి, నష్టపోయిన విద్యార్థులకు కేంద్రప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పాఠశాలల మూసివేతను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ పట్టణ అధ్యక్షుడు దిలీప్, నాయకులు విక్రమ్, కలై తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

- నిబంధనల అమలుకు అధికారుల సన్నాహం
- వాహనదారులకు అవగాహన సదస్సులు



హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రవాణశాఖ అధికారులు (ఫైల్)

కాణిపాకం: వాహనదారుల భద్రతకు, రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్యను తగ్గించేందుకు అప్పటి కేంద్ర ప్రభుత్వం 1988లో మోటారు వాహన చట్టం కింద హెల్మెట్ ధారణ తప్పనిసరి చేసింది. 2010లో ఐక్యరాజ్య సమితి ఆదేశాల మేరకు వాహనదారుడి వెనుక కూర్చున్న ప్రయాణికులు కూడా హెల్మెట్ ధరించాలనే నిబంధనలను అమలులోకి తెచ్చింది. దేశంలో ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వేలసంఖ్యలో ప్రజలు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో ఈ చట్టం తీసుకు వచ్చింది. అయినా కేంద్ర, రాష్ట్రాల నిర్లక్ష్యం వల్ల మోటారు వాహన చట్టం సక్రమంగా అమలు కాక, ఏటా రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య పెరుగుతూ వస్తోందని గతంలో ఓ న్యాయవాది ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం ఇటీవల హైకోర్టు వెలువరించిన తీర్పులో కేంద్ర మోటారు వాహన చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి నిబంధనల మేరకు ట్రాఫిక్ జరిమానాలు భారీగా విధించాలని ఆదేశించింది. అలాగే తీవ్రత, పరిస్థితులను బట్టి డ్రైవింగ్ లైసెన్సులు మూడు నెలల వరకు రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు తీర్పులో సూచించింది.

అమలు చేసేలా..చర్యలు

మోటారు వాహన చట్ట ఉల్లంఘనలపై రవాణాశాఖ తీసుకుంటున్న చర్యలేమిటని హైకోర్టు ప్రశ్నించడంతో ఆ శాఖ అధికారులు అలర్ట్ అయ్యారు. రాష్ట్రంలో మోటారు వాహన చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏపీ లీగల్ సర్వీసెస్ ఆథారిటీకి బాధ్యతను అప్పగించింది. జిల్లాలో సుమారు 3.56 లక్షల ద్విచక్ర వాహనాలు, సుమారు 15 లక్షల లైసెన్సులు జారీ అయ్యాయి. జిల్లాలోని వివిధ రహదారుల్లో ఏటా దాదాపు నాలుగు వేల వరకూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోజూ ప్రమాదాల్లో సగటున ముగ్గురు మరణిస్తున్నారని కొంతకాలం క్రితం ఒక అధ్యయనంలో తేలింది. మృతుల్లో ఎక్కువగా మోటార్ సైక్లిస్టులే ఉండటం, అందులోనే హెల్మెట్ ధరించని యువకులే ఉండటంతో నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సంకల్పించారు. దీంతో కొత్త ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసిన రోజునే హెల్మెట్ తీసుకోవలసిన నిబంధనను రవాణాశాఖ విధించింది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సర్టిఫైడ్ హెల్మెట్లను ధరించాలని, తలకు సరిపోయే విధంగా సౌకర్యవంతమైన హెల్మెట్‌ను ఎంచుకోవాలని రవాణాశాఖ చెబుతోంది.

ప్రాణం విలువ గ్రహించండి



అధికారుల బలంవతంతోనే, జరిమానాలు వేస్తారనే భయంతో హెల్మెట్ ధరించడం కంటే..ప్రమాదవశాత్తు జరిగే రోడ్డు ప్రమాదాలు గుర్తించాలి. ప్రాణం విలువను తెలుసుకోవాలి. బైక్ నడిపేటప్పుడు తమకో కుటుంబం ఉందనే విషయాన్ని గుర్తించాలి. ఫ్యాషన్ పేరుతో హెల్మెట్‌కు దూరం కావద్దు. దీనిపై తరచూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని హెల్మెట్ ధరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

-నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

ఇలా చేస్తే రక్ష

- ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చుననే అవగాహన పెంచాలి.
- వాహన చట్ట నిబంధనల గురించి, హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలు, ధరించకుంటే కలిగే ప్రాణ నష్టాన్ని తెలియజేసేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.
- భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండే తేలికపాటి హెల్మెట్‌లను ఎంపిక చేసుకోవాలి.
- రోడ్లపై విధులు, వాహన తనిఖీలు నిర్వహించే పోలీసు అధికారులు తప్పనిసరిగా బాడీ కెమెరాలు ధరించేలా చర్యలు తీసుకోవాలి.
- మోటారు వాహన చట్టాన్ని ఉల్లంఘించే ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానా వారిపై కఠినంగా వ్యవహరించాలి.

హెల్మెట్..కవచం

- రోడ్డు ప్రమాదాల బారిన పడితే హెల్మెట్లు తల లేదా మెదడుకు తీవ్రమైన గాయం కాకుండా రక్షణ కల్పిస్తాయి.
- ముఖ కవచంతో కూడిన హెల్మెట్లు గాలి, దుమ్ము ప్రభావాన్ని తగ్గించడం ద్వారా దృశ్య మానతను మెరుగుపరచడంలో సహాయపడతాయి.
- బైకు నడుపుతున్న వాతావరణ పరిస్థితుల్లో వాంఛనీయమైన వెంటిలేషన్‌ను అందించే హెల్మెట్ సౌకర్యంగా ఉంటుంది.

ఘనంగా గంగమ్మ జాతర



విశేష అలంకరణలో అమ్మవారు

శ్రీరంగరాజపురం: మండలంలోని అంకనపల్లి గ్రామంలో నడివీధి గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించడంతో జనం పోటెత్తారు. తొలిపూజను కనులారా వీక్షించారు. అమ్మవారికి అంబలి, పిండివంటలు, నైవేద్యం సమర్పించారు. పలువురు భక్తులు వివిధ వేషధారణల్లో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత డప్పు వాయిద్యాల నడుమ గంగమ్మను నడివీధిలో కొలువుదీర్చారు. భక్తులు కరుణించు తల్లీ.. కాపాడు తల్లీ గంగమ్మా అంటూ వేడుకున్నారు. అనంతరం భక్తులు అమ్మవారి ఆలయ ఆవరణలో పొంగళ్లు వండి అమ్మవారికి ప్రసాదం సమర్పించారు. స్థానిక సర్పంచ్ దామునాయుడు చేతుల మీదుగా తొలి పూజ చేసి జాతర ఘట్టాన్ని ప్రారంభించారు. అనంతరం నిత్య కై ంకర్యాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పోటెత్తారు.

వైభవంగా గంగమ్మ కొలువు

కార్వేటినగరం: మండల పరిధిలోని ఎగువరాజుల కండ్రిగ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కారేటిగంగమ్మ ఆలయంలో కొలుపు వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ క్రమంలో భాగంగా మహిళలు అమ్మవారికి అంబలిని నైవేద్యంగా సమర్పించారు. అదేవిధంగా ఆలయ ఆవరణలో పొంగళ్లు వండి పిండిదీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారి గెరిగెను ప్రత్యేక వాయిద్యాలు, బాణసంచాలు పేల్చి పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు అమ్మవారికి ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని ఆలయంతో పాటు గ్రామ వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న గంగమ్మ

అమ్మణ్ణమ్మ కుటుంబానికి పరామర్శ



అమ్మణ్ణమ్మ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్వేటినగరం: మండల పరిధిలోని ముక్కరవారిపల్లి పంచాయతీ గంగమాంబాపురం గ్రామానికి చెందిన అమ్మణ్ణమ్మ(89) అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎంపీపీ లత భర్త, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ గ్రామానికి వెళ్లి అమ్మణ్ణమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం వారు మాట్లాడుతూ అమ్మణ్ణమ్మ కుటుంబం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేశారని తెలిపారు. అదేవిధంగా ముక్కరవారిపల్లి సర్పంచ్ లోకనాథం, ఉప సర్పంచ్ సతీష్ కూడా అమ్మణ్ణమ్మకు నివాళులు అర్పించారు.

'నేను బడికి పోతా'తో సత్ఫలితాలు

పుత్తూరు: మండల పరిధిలోని నేసనూరు పంచాయతీకి చెందిన మొగిలమ్మ కాలనీలో మంగళవారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేశారు. ఇదివరకు బడికి పోతూ ఉండి పూర్తిగా బడి మానేసిన విద్యార్థులను తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ తిరుమలరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి, డ్రాపౌట్లు, పాఠశాలలో నమోదు కాని పిల్లలను గుర్తించి వందశాతం విద్యార్థుల నమోదు చేయాలన్న లక్ష్యంతో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ బాలసుబ్రమణ్యం, గోపాలకృష్ణాపురం, పిళ్లారిపట్టు, నేసనూరు హెచ్‌ఎంలు, సీఆర్‌ఎంటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెంగీ నివారణే అందరి లక్ష్యం

నగరి : డెంగీ నివారణకు విస్తృత పర్యటన చేపట్టాలని టెస్టింగ్ శ్యాంపుల్స్ సేకరణ కోసం నియమించిన ప్రత్యేక సిబ్బందికి మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి సూచించారు. మంగళవారం సిబ్బంది చేపట్టాల్సిన చర్యలను ఆమె తెలియజేశారు. డెంగీ నివారణకు మాసంలో చేపట్టవలసిన పనులు, ఎస్‌ఎస్‌హెచ్ ల్యాబ్ సేవల పట్ల చర్చించారు. నగరి రూరల్, నగరి మున్సిపల్ ప్రాంతాల్లో డెంగీ అనుమానిత కేసులను గుర్తించి సెరా శ్యాంపుల్స్ సేకరించి ఎలీసా టెస్టులకు ఆస్పత్రికి పంపాలన్నారు. దోమల ద్వారా మలేరియా, బోధ వ్యాధి, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు, ఇతర జ్వరాలు వ్యాపిస్తాయని దోమలు నియంత్రణ ముఖ్యమన్నారు. మంచినీటి చెరువులు, గుంటల్లో దోమపిల్లలను తినే గంబూషియా చేపలను వదలాలన్నారు. మురుగునీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. వారంరోజుల పాటు జ్వరంతో బాధ పడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో గానీ, ప్రైవేటు ల్యాబ్‌లలో గానీ పరీక్షలు నిర్వహించుకునే వారిని గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రమే అందుబాటులో ఉండే ఎలీసా టెస్టులు చేయించాలన్నారు. డెంగీ బారిన పడినట్లు గుర్తిస్తే వారికి డెంగీ నివారణ కిట్లు అందించాలన్నారు.



ప్రత్యేక సిబ్బందికి సూచనలు ఇస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి

గ్రామాల్లో పర్యటించండి

పాలసముద్రం : ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలతో ఆయన సమీక్ష నిర్వహించారు. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులను కాస్త అరికట్టాలంటే ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ లేదా మలాథిన్ మందులు పిచికారీ చేయాలన్నారు. రాత్రి సమయంలో దోమతెరలు వాడాలన్నారు. తాగునీటిని కాచి వడబోసి తాగాలని సూచించారు. దగ్గు, జలుబు రెండు, మూడు రోజులు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో ఓఆర్‌ఎస్ ద్రావణం ప్రజలకు అందుబాటులో ఉంచాలని హెచ్చరించారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి మండలకేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పశువులకు వ్యాక్సిన్ వేయించాలి



గోపూజ చేసి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమంలో ప్రారంభిస్తున్న జేడీ ప్రభాకర్

పాలసముద్రం: పాడిపశువుల్లో పసిరిక మేతతో పశువుల్లో గొంతువాపు వంటి సీజనల్ వ్యాధులను గుర్తించి ముందస్తుగా వ్యాక్సిన్ వేయించాలని పశు సంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం సచివాలయ ఆవరణలో సర్పంచ్ గాలి మహేష్‌బాబు, పశువైద్యాధికారి యశస్వి సమక్షంలో ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ శాఖ ఈఓ బాలసుబ్రమణ్యం డీఎల్‌ఐఏ తిరుపతి వారి ఆధ్వర్యంలో పాడి పశువులకు గర్భకోశ, సీజనల్ వ్యాధులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రైతులకు పాడి పశువులకు వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పశు సంవర్ధకశాఖ అధికారులతో కలసి గోపూజ చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జేడీ మాట్లాడుతూ ఏడాది దూడలకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు చేలల్లో పచ్చిక పెరుగుతోందని, వీటిని పశువులు తినడంతో వాటిలో ఉండే బ్యాక్టీరియా వాటి ఆరోగ్యంపై తీవ్ర దుష్పరిణామాలు చూపుతాయన్నారు. అందువల్ల వ్యాధుల్లో హెచ్‌ఎస్(గొంతువాపు వ్యాధి) వస్తుందని, అలా కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సంకరజాతి పశువులకు వివిధ గర్భకోశ వ్యాధికి చికిత్స చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఏడీ మురళిమోహన్, పశువైద్యాధికారి అనిజ, జేవీఓ లోకనాథం, ఏహెచ్‌ఏలు గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, గోపాలమిత్ర నాగరాజు, లోకయ్య, మాజీ ఎంపీటీసీ బాబునాయుడు పాల్గొన్నారు.

అక్రమ క్వారీలపై దృష్టి పెట్టండి



వనదుర్గాపురం: క్వారీని పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

పాలసముద్రం : మండల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు, అనుమతి లేని క్వారీలపై రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తహసీల్దార్ సుబ్బులక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని అనుమతి లేని క్వారీ, భూముల ఆక్రమణలపై సిబ్బందితో కలసి పర్యటించారు. తమిళనాడు సరిహద్దుల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణ, అనుమతి లేని క్వారీలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అనుమతి లేకుండా క్వారీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నరసింహపురం పంచాయతీ బొల్లికొండలో అనుమతి లేకుండా తమిళనాడు వాసి విచ్చలవిడిగా కట్టురాళ్లు తరలిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. సంబంధిత వీఆర్‌ఓ బొల్లికొండలో జరిగే అక్రమ తరలింపును ఆపేయాలని సూచించారు. వనదుర్గాపురం పంచాయతీలో జరుగుతున్న క్వారీ పనులను పరిశీలించి రికార్డులను క్షుణ్ణంగా చెక్ చేశారు. కార్యక్రమంలో సర్వేయర్ కిరణ్‌కుమార్, వీఆర్‌ఓ ప్రవీణ్, విలేజ్ సర్వేయర్ హరి పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయ వనరులుగా ఎస్‌డబ్ల్యూపీసీలు

కార్వేటినగరం: పంచాయతీ ఆదాయవనరులుగా ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సేకరణ కేంద్రాలు)ను అభివృద్ధి చేసుకోవాలని జిల్లాపరిషత్ సీఈఓ పీ.గ్లోరియా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని చెత్త సేకరణ కేంద్రాన్ని సీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ ఆదాయ వనరులలో భాగమైన ఎస్‌డబ్ల్యూపీసీలను మరింత అభివృద్ధి చేసి వాటి ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీలను అభివృద్ధి దిశగా తీసుకువెళ్లాలని ఆదేశించారు. అలాగే చెత్త సేకరణ కేంద్రాల్లో తయారయ్యే కంపోస్టు ఎరువులపై రైతులకు అవగాహన కల్పించి వ్యవసాయ పంటలకు వినియోగించే విధంగా చూడాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సీఈఓ వెంట డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ షణ్ముగం, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, కృష్ణయ్య, ఏకాంబరం, పలువురు సిబ్బంది ఉన్నారు.



కార్వేటినగరంలో చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ సీఈఓ గ్లోరియా

సామాజిక సేవలో ఎల్‌ఐసీ ఉద్యోగులు



రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న ఎల్‌ఐసీ యూనియన్ నాయకులు


పుత్తూరు: అఖిలభారత బీమా ఉద్యోగుల సంఘం (ఏఐఐఈఏ) ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఎన్.లక్ష్మణకుమార్ మాట్లాడుతూ ఎల్‌ఐసీ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఏటా యూనియన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 5వ తేదీన బ్రాంచి కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గలవారు 99490 51900 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్, హెడ్ నర్స్ దిల్‌షాద్, ఫార్మాసిస్ట్ అన్నాదొరై, ఎల్‌ఐసీ యూనియన్ నాయకులు ఆంజనేయులు, గణేష్‌బాబు, రాజేష్, ప్రవీణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నగరి : నగరి ఐసీడీఎస్ పరిధిలోని నగరి మున్సిపాలిటీ, నింద్ర, విజయపురం మండలాల్లో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ కె.కృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరి మున్సిపాలిటీ టీఆర్ కండ్రిగ (ఓసీ), సత్రవాడ-1(బీసీబీ) అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు, నింద్ర మండలంలో కీళంబాకం దళితవాడ (ఓసీ), శ్రీరామాపురం ఎస్టీ కాలనీ (ఎస్టీ) మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, కొప్పేడు దళితవాడ (ఎస్సీ), పాదిరి (ఓసీ) అంగన్‌వాడీ పోస్టులు, విజయపురం మండలంలో ఎల్లసముద్రం (బీసీ-డి) మినీ అంగన్‌వాడీ కార్యకర్త, శ్రీహరిపురం (బీసీ-డీ) అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతి పాసై స్థానిక వివాహిత మహిళ (ఆ ఊరి కోడలు) అయి ఉండాలన్నారు. వయసు జూలై 1వ తేదీకి 21-35 వయసు లోపల ఉండాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్, రేషన్‌కార్డు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేసి జతపరచాలన్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

గంగాధర నెల్లూరు మండలంలో..

గంగాధర నెల్లూరు: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మండలాల్లో ఖాళీ ఉన్న ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ వినతశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పెనుమూరు మండలంలోని చిన్న కలికిరి అంగన్‌వాడీ వర్కర్ (బీసీ-ఎ), పాళ్యం యానాది కాలనీలో మినీ అంగన్‌వాడీ వర్కర్ (ఎస్టీ), పుట్టగానిపల్లె మినీ అంగన్‌వాడీ వర్కర్ (ఓసీ), కే.గొల్లపల్లి అంగన్‌వాడీ హెల్పర్ (ఓసీ), గంగాధర నెల్లూరు మండలంలోని కలిజవేడు అంగన్‌వాడీ హెల్పర్ (ఓసీ), అగరమంగళం అంగన్‌వాడీ హెల్పర్ (ఎస్సీ), కే.వెంకటాపురం దళితవాడలో అంగన్‌వాడీ హెల్పర్ (ఎస్సీ), కోటాగరం దళితవాడలో అంగన్‌వాడీ హెల్పర్ (ఎస్సీ) తూగుండ్రం పంచాయతీ దాసరపల్లె అంగన్‌వాడీ హెల్పర్ పోస్ట్ (ఓసీ), తిరువీధికుప్పం అంగన్‌వాడీ హెల్పర్ (ఓసీ) ఖాళీలకు బీసీ కులాలవారు తహసీల్దార్ కార్యాలయంలో కుల, వివాహ ధ్రువీకరణ పత్రాలను విద్యార్హత సర్టిఫికెట్లు దివ్యాంగులు కలిగిన వారు సంబంధిత సర్టిఫికెట్లు జిరాక్స్‌లపై గెజిట్ అధికారిచే అటెస్టేషన్ సంతకాలు చేసుకోవాలని కోరారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ కార్యాలయంలో చేర్చాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ వర్కర్ మినీ అంగన్‌వాడీ వర్కర్ హెల్పర్ పోస్టులకు 10వ తరగతి పాసై ఉండాలని, అభ్యర్థుల వయసు 21-35 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు సంబంధించిన వారు తహసీల్దార్ కార్యాలయంలో కులం, నివాస ధ్రువీకరణ పత్రాలను సర్టిఫికెట్లను తెచ్చుకోవాలని తెలిపారు.



సీడీపీఓ వినతశ్రీ

కార్వేటినగరం మండలంలో..

కార్వేటినగరం: కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యోగాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మసునంద తెలిపారు. మంగళవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీడీపీఓ మాట్లాడారు. కార్వేటినగరం ఐసీడీఎస్ పరిధిలో వివిధ స్థాయిలో 8 ఖాళీలు ఉన్నాయని వీటిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అర్హత ఉన్నవారు ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను కార్యాలయానికి అందించాలన్నారు.

ఖాళీల వివరాలు..

పెద్దకొండేపల్లి(శ్రీరంగరాజపురం మండలం) అంగన్‌వాడీ వర్కర్ మెయిన్- ఓసీ, డీకేమర్రిపల్లి(శ్రీరంగరాజపురం) అంగన్‌వాడీ వర్కర్ మెయిన్- ఎస్సీ, సీకే పురం(శ్రీరంగరాజపురం) అంగన్‌వాడీ హెల్పర్-బీసీ- డీ, తంగేలిమిట్ట(వెదురుకుప్పం) అంగన్‌వాడీ వర్కర్ మెయిన్-ఓసీ, ముతాలం(వెదురుకుప్పం) అంగన్‌వాడీ వర్కర్ మెయిన్ -ఓసీ, కురివికుప్పం(వెదురుకుప్పం) అంగన్‌వాడీ హెల్పర్-ఓసీ, జగన్నాథపురం(కార్వేటినగరం) అంగన్‌వాడీ హెల్పర్- బీసీ-డీ, ఆర్కేవీబీపేట(కార్వేటినగరం) అంగన్‌వాడీ హెల్పర్- బీసీ-డీ. పైన తెలిపిన ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు స్థానికులై ఉండాలని, వారి విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు కార్డు జిరాక్స్‌లను దరఖాస్తులకు జత చేయాలని సూచించారు.